

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## నిజామాబాద్ కామారెడ్డి

గురువారం 14 ఆగస్టు 2025 7 పేజీలు




### అధికారులు, సిబ్బంది అందరూ కార్యస్థానాల్లో

# అందుబాటులో ఉండాలి

### - కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

భారీ వర్ష సూచనల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కార్యస్థానాల్లో ఉండని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్ పల్లి, పాల్దా గ్రామాలలో కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిర్మన్ పల్లి రైతు వేదికను కలెక్టర్ సందర్శించగా, వ్యవసాయ విస్తీర్ణ అధికారి (ఏఈఓ) అందుబాటులో లేకపోవడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రైతు వేదికకు తాళం వేసి ఉండడం, పలువురు రైతులు బయట నిరీక్షిస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందుకు



ఫోన్ చేసి అక్కడికి పిలిపించారు. అదే సమయంలో ఏఈఓ కూడా చేరుకోగా, రైతు వేదిక వద్ద రైతులకు అందుబాటులో లేకుండా ఎక్కడికి వెళ్లావంటూ కలెక్టర్ నిలదీశారు. ప్రస్తుతం భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందరూ కార్యస్థానాలలో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు ఇంత నిర్లక్ష్యం అని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టర్ తిర్మన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, పనితీరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అక్కడి నుండి పాల్ద గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. వంటగదిలోకి వెళ్లి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, మెనూ పక్కాగా అమలు కావాలని (మిగతా 2లో)



### భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని

# డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన కలెక్టర్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

కామారెడ్డి పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి చందర్,మున్సిపల్ కమిషనర్, జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్, తహసీల్దార్ ఇతర అధికారులతో కలిసి విద్యానగర్ కాలనీలోని సాయిబాబా గుడి వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధిక వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలో డ్రైనేజీలు బ్లాక్ అయి మురుగునీరు రోడ్ల మీదికి, ఇండ్లలోకి రాకుండా ముందస్తుగా అన్ని డ్రైనేజీలను శుభ్రం చేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, తడి మరియు పొడి చెత్త



ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్రతిరోజు వాహనాల ద్వారా చెత్తను సేకరించి డిస్పోజల్ చేయాలని, పట్టణంలో ఎక్కడ వర్షం నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని, (మిగతా 2లో)



### 42 శాతం బీసీ రిజర్వేషన్‌కు బిజెపి ఎంపీలు

# అనుకూలమా..? వ్యతిరేకమా...?

### - రామడుగు ప్రాజెక్టు నీటిని విడుదల చేసిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి



**సూర్య నిజామాబాద జిల్లా ప్రతినిధి**

ధర్పల్లి మండలంలోని రామడుగు గ్రామ శివారులో ఉన్న రామడుగు ప్రాజెక్టుకు సంబంధించిన కుడి ఎడమల కాలువల నుంచి నిజామాబాద్ రూరల్ ఎమ్మె ల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి నీళ్లను విడుదల చేశా రు. రామడుగు ప్రాజెక్టు కట్టమీద ఉన్న కట్ట మైసమ్మకి పూజ చేసి, అనంతరం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే (మిగతా 2లో)

# జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

### - అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఎమ్మెల్యే

**సూర్య నిజాంసాగర్** 2లో



### డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న

# తెలంగాణ ప్రభుత్వం

### - మత్తు పదార్థాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగ నాషా ముక్త్ భారత అభియాన్ ప్రతిజ్ఞ

### - జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

'నషా ముక్త్ భారత్ అభియాన్-2025' లో భాగంగా కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యం. రాజేశ్ చంద్ర్, హాజరై, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా (మిగతా 2లో)



# అధికారులు, సిబ్బంది అందరూ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, దాని నిర్వహణను చక్కబెట్టాలని ఏ.ఈ.ఓను ఆదేశించారు. నీటి సంరక్షణ కోసం అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలలో నిర్మించిన సోక్ పిట్ ల నిర్వహణ సజావుగా జరిగేలా, వాటి వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. కాగా, పాఠశాలకు 30 మంది విద్యార్థులు హాజరవగా, ముఖ గుర్తింపు విధానం ద్వారా 25 మంది విద్యార్థులు హాజరు మాత్రమే ఆన్లైన్ లో నమోదు చేయడాన్ని గమనించిన కలెక్టర్, మిగతా విద్యార్థులు ఎఫ్.ఆర్.ఎస్ హాజరు విషయమై ప్రధానోపాధ్యాయుడు సుమన్ రెడ్డిని ప్రశ్నించారు. సాంకేతిక కారణాల వల్ల నమోదు కాలేదని హెచ్.ఎం తెలుపగా, కలెక్టర్ తన సమక్షంలో విద్యార్థుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో నమోదు చేయించారు. ఏదైనా సాంకేతిక ఇబ్బందులు ఏర్పడితే, సంబంధిత విభాగం అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్ళాలని సూచించారు. ఎఫ్.ఆర్.ఎస్ నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తిన సమయంలో ఎవరిని సంప్రదించాలి అనే విషయమై జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్.ఎంలకు టెక్నికల్ పర్సన్ ఫోన్ నెంబర్, తదితర వివరాలతో కూడిన సమాచారాన్ని చేరవేయాలని ఫోన్ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, పనితీరును పరిశీలించారు. అనంతరం సహకార సంఘం ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. రైతులకు ఇప్పటికే పూర్తి స్థాయిలో యూరియా, ఇతర ఎరువులను అందజేశామని సొసైటీ సీఈఓ రాకేష్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇంకనూ అవసరమైన వారికి ఎరువులు అందుబాటులో ఉంచేందుకు వీలుగా 10 టన్నుల వరకు ఎరువుల కోసం ఇండెంట్ పంపామని, ఈ రోజు మధ్యాహ్నం వరకు ఎరువుల నిల్వలు చేరుకుంటాయని తెలిపారు. ఎక్కడ కూడా ఎరువుల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పొల్ద గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు అందరూ ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ కు బిజెపి ఎంపీలు అనుకూలమా...? వ్యతిరేకమా...?

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ రామడుగు ప్రాజెక్టు నుండి వివిధ గ్రామాలకు ఆయకట్టు ద్వారా నీళ్లు వెలుతాయని అన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు క్రింద ఉన్న పంట పొలాలు ఎండి పోతున్న యని రైతులు రూరల్ ఎమ్మెల్యే కు విన్నవించుకోవడంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి,ఆయకట్టు పంట పొలాలకు బుధవారం రోజు నీళ్లను విడుదల చేయడం జరిగిందని అన్నారు. సుద్దులం, రామడుగు, మైలారం, కోరట్పల్లి, కలి గౌడ్ చింతలూరు మనోహరా బాద్, వంటి గ్రామాల పంట పొలాలకు నీరు చేరుతుందని అన్నారు. రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ వంటి పథకాలను అమలు చేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందని అన్నారు, అలాగే 42 శాతం బీసీ రిజర్వేషన్ కు టిఆర్ఎస్ బిజెపి నాయకులు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, నిజాంబాద్ ఎంపీ అరవింద్, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్లు బీసీ రిజర్వేషన్ కు వ్యతిరేకామా...? అనుకూలమా..? చెప్పాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్ కొరకు రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో చేర్చాలని కేంద్రంపై బీజేపీ ఎమ్మెల్యేలు ఒత్తిడి తేవాలని అన్నారు. లేకపోతే బిజెపి ఎంపీలను గ్రామాల్లో తిరగకుండా బీసీ ప్రజలు తరిమి కొడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిన్న బాలరాజ్, డిచ్పల్లి మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, ధర్పల్లి మండల తహసిల్దార్ శాంత, ఎంపీడీవో, రామడుగు వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, సుద్దులం విడిసి చైర్మన్ సాయి రెడ్డి, రాముడు గ్రామ శాఖ అధ్యక్షులు ఆనంద్,సుద్దులం గ్రామ శాఖ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

## - అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఎమ్మెల్యే

**సూర్య నిజాంసాగర్**

జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు.బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే లబ్దిదారుల పిర్యాదులు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు, అవినీతి, లేకుండా చూడాలని, లబ్దిదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, పేదోడి సొంతింటి కల నెరవేర్చాలని చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాలు శర వేగంగా జరుగు



తున్నాయని, జుక్కల్ నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు జుక్కల్ నియోజకవర్గంలో పూరి గుడిసెలు కనిపించక పోవడం అనేదే తన లక్ష్యం అన్నారు. ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అర్హులైన వారు ఇంకా ఎవరైనా ఉన్నా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. లబ్దిదారులు, ప్రభుత్వ అధికారుల సూచనలు పాటించి నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు.ఇండ్ల నిర్మాణ దశలను బట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులను లబ్దిదారుల అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయన్నారు. దళారులు ఇష్టారీతిగా ఇసుక రేట్లు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల అభ్యున్నతి కోసమే పని చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త మీద ఉందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలతో పని చేస్తున్నామని తెలిపారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న అధికారులను ఎమ్మెల్యే అభినందించారు.ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల అధికారులు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సూర్య- నవీపేట్**

మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు సూచించారు. మండలంలో గల లోతట్టు ప్రాంతాలైన నందిగాం, యంచ, జన్నేపల్లి, నాళేశ్వర్ గ్రామాలను బుధవారం పరిశీలించారు. తాహసిల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ. ప్రభుత్వ సమాచారం మేరకు రాబోయే 72 గంటలలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున, వర్షాలు ఎక్కువగా పడితే ప్రజలకు నష్టం కలిగే ప్రాంతాలను గుర్తించామని. ఆ ప్రాంతాలలో చెరువులు, కుంటలు, మాటు కాలువలు మరియు గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్థానిక ఎస్సై వినయ్ కుమార్, ఎంపీఓ రామకృష్ణ, నీటిపారుదల శాఖ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్చేయాలని, భారీ వర్షం సంభవించినప్పుడు పట్టణ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రాకుండా ముందస్తుగా ప్రచారం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు పనిముట్లను అందజేసి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పనిచేసే కార్మికులకు రైన్ కోట్స్ మరియు అత్యవసరమైన ఇతర సామాగ్రి అందజేయుటకు వెంటనే ప్రపోజల్స్ పంపించవలసిందిగా ఆదేశించినారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రరెడ్డి టిపిఓ గిరిధర్ గోపాల్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది సంబంధిత ఇంజనీర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్న చర్యలలో భాగంగా మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా నషా ముక్త్ భారత్ అభియాన్ (%చీవీదీూ%)ను అమలు చేస్తోందని అన్నారు. ఈ అవగాహన ప్రచారం యొక్క 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రోజున మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు మరియు ప్రజల నుండి విస్తృత భాగస్వామ్యాన్ని చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సామూహిక ప్రతిజ్ఞను నిర్వహించడం జరిగింది అని అన్నారు. జిల్లా పరిధిలో మాదకద్రవ్యాల సరఫరా, దుర్వినియోగంపై పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయి నిఘా ఉంచుతోందని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా, సాగు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అవసరమైతే %ూణ-ూఃహ% అమలు చేస్తామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మాణం కోసం అందరం కలిసి పనిచేయాలని పిలుపునిస్తూ, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పి బి. చైతన్య రెడ్డి స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి. శ్రీధర్, అధికారులు మరియు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

# వీధి దీపాల సమస్య పరిష్కరించండి

**సూర్య బోధన్**

బోధన్ పట్టణంలోని వార్డ్ నెంబర్ 33 లో గల తట్టికోట్ గల్లిలోని వీధి లైట్ గత వారం పది రోజుల నుంచి రావడం లేదు దీని కారణంగా రాత్రి సమయంలో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా స్పందన లేదు ఫోన్ లేపకపోవడం వంటివి చేస్తున్నారు. దయచేసి మున్సిపల్ అధికారులు ఈ యొక్క విషయాన్ని గమనించి వెంటనే తమ యొక్క వీధిదీపాన్ని ఏర్పాటు చేయాలని గల్లి వాసులు కోరుతున్నారు.



# సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## - నగరపాలక సంస్థ కమిషనర్

**సూర్య ఇందూర్**



భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ దిలీప్ కుమార్ ఆదేశించారు. నగరంలోని హమల్?వాడి,దుబ్బ బైపాస్ రోడ్,ఖానాపూర్,నిజాం కాలనీ,అర్సపల్లి, బోధన్ రోడ్,కెనాల్ కట్ట,శివాజీ నగర్ తదితర ప్రాంతాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శానిటేషన్ విభాగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా చూడాలన్నారు.ప్రధానంగా మురికి కాల్వలను శుభ్రం చేయాలని, చెత్తాచెదారం రోడ్లపై ఉండకుండా చూడాలని ఆదేశించారు. నివాస ప్రాంతాల్లో స్ప్రే చేయాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమ త్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట జేసీబీ వినియోగించాలని సూచించారు.ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని తెలిపారు. పాత భవనాలను గుర్తించి ఖాళీ చేయించాలని తెలిపారు.కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీ మనోహర్ రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు,సానిటరీ సూపర్వైజర్లు,ఇన్స్పెక్టర్లు, జవాన్లు ఉన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఎస్ ఈ శ్రావణ్ కుమార్

**సూర్య కామారెడ్డి**

ఈ నెల 13 నుంచి 16 వరకు వరుసగా నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ వినియోగదా రులు, ముఖ్యంగా రైతులు విద్యుత్ పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని కామారెడ్డి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఎన్. శ్రావణ్ కుమార్ కోరారు . ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తున్నామని , మెన్ , మెటీరియల్ సిద్ధంగా ఉంచుకున్నామని తెలిపారు .మొబైల్ ట్రాన్స్ఫార్మర్ వాహనాలను సిద్ధంగా ఏర్పాటు చేసుకున్నామని అన్నారు . ఉద్యోగులకు షిఫ్ట్ విధానంలో 24 గంటల విధులు కేటాయించామని పేర్కొన్నారు . ఎటువంటి విద్యుత్ అంతరాయం ఏర్పడిన పునరుద్దరణ టీంలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు . కంట్రోల్ రూములు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు .ఫోన్ 8712481946 నంబర్ లో సంప్రదించాలని పేర్కొన్నారు. రైతులు , వినియోగదారులు సొంతంగా విద్యుత్ కు సంబంధించి న పనులు ఎట్టి పరిస్థితిల్లో చేయకూడదని వివరించారు.తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా మరియు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు, ప్రమాదకరంగా ఉన్నటువంటివి గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి TGNPDCL టోల్ ఫ్రీ నం.1912 ద్వారా తెలియచేయగలరు. ముఖ్యంగా రైతు సోదరులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం నాణ్యతలేని వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున, కరెంటు మోటార్లను కాని, పైపులను కాని, ఫుట్ వాల్వులను కాని ఏమరపాటుతో తాకకూడదు. వ్యవ సాయ పంపుసెట్లను మరియు స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయవలెను.లి రైతులు, వినియోగదారులు కరెంట్ పనులను సొంతంగా చేసుకొకూడదని , అర్హత కలిగిన ఎలెక్ట్రిషియన్ తో పనులు చేసుకోగలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రైతులు ట్రాన్స్ ఫార్మర్ల వద్ద అధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరుచేయడం, ఎబి స్విచ్లు ఆపరేట్ చేయడం మరియు కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు . వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న వెంటనే TGNPDCL టోల్ ఫ్రీ నెంబర్ 1912 ద్వారా తెలియజేయగలరని ఎస్ ఈ శ్రావణ్ కుమార్ తెలిపారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సూర్య వేల్పూర్**

రాబోయే 72 గంటల్లో భారీ వర్షాలు వస్తున్న సందర్భంగా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించినట్లు వేల్పూర్ ఎస్సై సంజీవ్ తెలిపారు .రాబోయే రెండు మూడు రోజుల్లో వర్ష సూచన దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని దిగువ తెలిపిన సూచనలు పాటించాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాగులు వంకల వద్దకు వెళ్లకూడదు .జలాశయాలు చెరువులు కుంటలు చూడడానికి వెళ్లకూడదు .ప్రమాదాన్ని గురి అయ్యే అవకాశం ఉంటుంది. వ్యవసాయ పనుల నిమిత్తం పోలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. పొలాల్లో పడిపోయిన విద్యుత్ తీగలతో ప్రమాదం కలిగే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలి. పురాతన కట్టడాలు వర్షతాకిడికి నాని పడిపోయే అవకాశం ఉంటుంది .ఎక్కడైనా వరద ఉధృతి తలెత్తిన సందర్భంలో పోలీస్ శాఖను సంప్రదించాలని అన్నారు. అత్యవసర సమయాల్లో 100 కు డయల్ చేయాలని లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712659700కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సంప్రదించాలని సూచించారు.

## పడగల్ లొ బీసీ హాస్టల్ తనిఖీ

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలం పడగల గ్రామంలో బీసీ హాస్టల్ ని మండల వైద్యాధికారిని వీణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న



భోజనం విషయం జాగ్రత్తగా ఉండాలని నాణ్యమైన వస్తువులను వాడాలని వార్డెన్ కు సూచించారు. ప్రతి గదిని తిరుగుతూ విద్యార్థుల యోగక్షేమాలు తెలుసు కున్నారు. వంట గదికి వెళ్లి పప్పు దినుసులు బియ్యం తదితర సామాన్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవి ధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వార్డెన్ కు తెలియజేశారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగిన మందులను ఇచ్చారు ఆల్బెండజల్ మాత్రలను వేసుకో వాలని సూచించారు చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనాలు చేయాలని సూచించారు వైద్యాధికారిని వెంట హాస్టల్ వార్డెన్ ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నేడు శాంతి కమిటీ సమావేశం

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలంలోని గ్రామాలలో వినాయక చవితిని పురస్కరించుకొని యూత్ సభ్యులు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న యూత్ సభ్యులకు నేడు శాంతి కమిటీ సమావేశం ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు పోలీస్ స్టేషన్లో శాంతి కమిటీ సమావేశం ఉంటుందని అన్నారు. యూత్ సంఘాల నుండి ముగ్గురు చొప్పున హాజరుకావాలని ఎస్ఐ సంజీవి తెలిపారు.

## అప్రమత్తంగా ఉండాలి

### - సబ్ కలెక్టర్ కిరణ్మయి

**సూర్య బాన్సువాడ రూరల్**

రానున్ననాలుగు రోజులుభారీవర్షాలు కురిసేఅవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిసూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలోబుధవారం బాన్సువాడసబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్,



మండల స్థాయిఅధికారులతో ఆమెసమీక్షా సమావేశం నిర్వహించారు .ఈసందర్భం గా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా అధికారులుతగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలుఅవసర మైతే తప్పబయటకు రాకూడదన్నారు. పిల్లలను చెరువులు, వాగుల్లో ఈత కొట్టడానికి పంపకూడదని, మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లరాదని సూచించారు.రైతులు విద్యుత్ మోటార్లు, వంగి ఉన్న విద్యుత్ స్తంభాల పట్ల జాగ్రత్తలుతీసుకోవాలన్నారు. శిథిలావస్థ లో ఉన్నఇళ్లలోనివసించరాదన్నారు. ప్రమాదకరంగా ప్రవహించే లో,లెవల్ వంతెనలు, కల్వర్టులపై నడవకూడదని, వాహనాలు నడపరాదని హితవు పలికారు.వర్షాల సమయంలో ప్రజల భద్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.

## వ్యవసాయ సహకార సంఘం సమావేశం....!

### - సొసైటి చైర్మన్ ఎగుల నర్సింలు

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఎల్లారెడ్డి పాలకవర్గ సమావేశం బుధవారం ఏర్పాటు చేసినట్లు సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింలు,



తెలిపారు ,జూన్ , జులై నెలల జమ ఖర్చులను సొసైటీ కార్యదర్శి విశ్వనాథం చదివి వినిపించారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మర్రి సూర్య ప్రకాష్, మాదిగ పొలయ్య, వెంగళ బాలరాజ్, లంబాడి లక్ష్మణ్, చెన్నంగారి సుఖేందర్ రెడ్డి, మాచబోయిన సత్యవ్వ, నాగం గోపికృష్ణ, పార్దే నారాయణ, నర్ల నరసింహులు, కార్యదర్శి యం.విశ్వనాథం సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితురాలికి న్యూట్రిషన్ అందజేత

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలం కుకునూరు గ్రామానికి చెందిన ఆరాధ్య సి ఎల్ హెచ్ ఎ అనారోగ్య బాధితురాలికి వాట్స్ స్వచ్ఛంద సంస్థ అలాగే అంకం జ్యోతి ఫౌండేషన్ ద్వారా బాలికకు అదనంగా న్యూట్రిషన్ అందజేయడం జరిగిందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. బాలికకు




న్యూట్రిషన్ను ఎక్కువ స్థాయిలో అందినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## వృత్తి వ్యాపార లైసెన్స్ జారీ,రెన్యువల్ ప్రారంభం

**సూర్య బాన్సువాడ రూరల్**

మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకుబాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో గలదుకాణయజమానులకు వృత్తి వ్యాపార లైసెన్స్ (ట్రేడ్ లైసెన్స్) పై అవగాహన కల్పిస్తూ, నూతనంగా



లైసెన్స్ జారీ కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ అధికారులు బుధవారం వ్యాపార సముదాయాలకు వెళ్లి వ్యాపారులకు వ్యాపార లైసెన్స్ పై అవగాహన కల్పించారు. లైసెన్స్ పొందిన వారు రెన్యువల్ చేసుకో వాలని మున్సిపల్ అధికారులు సూచించారు . ఈ కార్యక్రమంలో మున్సి పల్ ఇన్ఛార్జ్ ఆర్.తుల శ్రీనివాస్, సిబ్బంది బాలరాజ్, తోట రవి, శ్రీనివాస్, బిల్ కలెక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు మార్కెట్ చేసుకోవాలి

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రస్తుతం మంజూరు అయిన 72 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో దాదాపుగా పనులు పూర్తికా వస్తున్న దృష్ట కొంత




మంది ఇప్పటివరకు మార్కెట్ చేయని వారు చేసుకోవాలని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మంజూరైన వారు త్వరిత గతిన మార్కెట్ చేసుకొని ఇండ్ల నిర్మాణం ప్రారంభించినట్లయితే మహిళా సంఘాల ద్వారా రుణాలను అందించే అవకాశం ఉంటుందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పూర్తి చేసుకున్న వారికి వెనివెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు న్యాయం చేయాలి

**సూర్య మోపాల్**

మోపాల్ మండలంలోని భైరపూర్ పరిధిలోని మోతీరాం నాయక్ తండా సమీపంలోని సాగు చేస్తున్న మొక్క జొన్న పంటపై అటవీ శాఖధికారులు అన్యాయంగా గడ్డి మందు చల్లారని వారి తీరుపై పిర్యాదు చేసినా రాణా ఎస్ ఎచ్ వో కేసు నమోదు చేయడం లేదని భాధిత కటుంబ సభ్యులతో పాటు గిరిజన నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జెడ్జి ఉదయ్ భాస్కర్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 5న ఘటన చోటు చేసుకోగా మోపాల్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తమకు న్యాయం చేయాలని ఆశ్రహించినట్లు తెలిపారు.అనంతరం పాలనాధికారి వినయ్ కృష్ణ రెడ్డిని కలిసి గిరిజనులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. భాధిత రైతు దంపతులు బాలరాజు, అల్ ఇండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ హరి నాయాక్, నాయకులు నరేష్ నాయక్, ఇందల్ నాయక్, రవి రాథోడ్, బాలునాయక్, గౌతమ్ జలంధర్ నాయక్, తదితరులున్నారు.

## ఇష్టంతో చదవండి.. ఉన్నత స్థాయికి చేరండి

### - ఎస్సై రాఘవేంద్ర

**సూర్య నసురుల్లాబాద్.**

విద్యార్థులుఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని నస్రుల్లా బాద్ ఎస్సై రాఘవేంద్ర విద్యార్థులకు సూచించారు. నస్రుల్లాబాద్ మండలం మైలారం



గ్రామంలోని పాఠశా లలో విద్యార్థులకు ఆయన పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ఆయనమాట్లాడుతూ,విద్యార్థులు కష్టపడిచదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతోచదివితే జీవితంలో విజయం సాధించడంఖాయమన్నారు.పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందన్నారు. ఉపాధ్యాయులు శివ, భాస్కర్, నాగేశ్, అనిల్, మకిందర్, రాజు, సంజీవి, మహేందర్, గంగా ప్రసాద్, సాయి,తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షం ముప్పు నేపథ్యంలో అధికారులతో సమావేశం నిర్వహించిన ఆర్డీవో పార్థ సింహారెడ్డి

సూర్య ఎల్లారెడ్డి

రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ ఆదేశాల మేరకు బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పార్థ సింహారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఫైర్, విద్యుత్, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షం హెచ్చరికల నేపథ్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో సూచించారు. భారీ వర్షాల





వల్ల మండలంలోని ప్రజలతో పాటు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు అధికారులుతీసుకోవాలన్నారు. ప్రజలు వాగుల్లో, చెరువుల్లో చేపలు పట్టడానికి వెళ్లవద్దని సూచించారు. గేదెల కాపర్లు జాగ్రతగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ప్రజలు బయటకు వెళ్లవద్దని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో.... ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం లో తాసిల్దార్ ప్రేమ్ కుమార్ అధ్యక్షతన భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షం కురేసే అవకాశం ఉండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిం చినట్టు తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి సుంకరి శ్రీనివాస్ రావు , ఎస్సై బొజ్జ మహేష్, మున్సిపల్ కమిషనర్ మహేష్, ఇరిగేషన్ డి ఈ వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ ఎంపీడీవో ప్రకాష్, విద్యుత్ శాఖ ఏఈ వెంకటస్వామి, ఫైర్ అధికారి వినోద్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే జాబ్ మేళా

సూర్య మోపాల్

నిరుద్యోగ యువతకు ప్రయివేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు తెలిపారు. ఆసక్తి గల పది, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణులు నిజామాబాద్ శివాజీ నగర్ లోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయానికి గురువారం ఉదయం 10.30గంటల కల్లా పత్రాలతో రావాలని సూచి%శీ%చారు. నగరంలోని ప్రభుత్వ బాలికల ఐటిఐ లో గురువారం ఉదయం 10గంటల నుంచి ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. మనోహరాబాద్ ఐటీసీ కంపనీ మేళా నిర్వహిస్తుందని, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణులు ఆర్యుల న్నారు. వివరాలకు 9441707536 నంబర్ ను సంప్రదించాలన్నారు.

# మాజీ సర్పంచ్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సూర్య- బిక్కనూర్



మండలంలోని సిద్ధిరామేశ్వర్ నగర్ గ్రామ మాజీ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ తల్లి ఆగమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి గుండె నిబ్బరంతో ఉండాలని, ఎలాంటి కలత చెందద్దాన్ని ధైర్యాన్ని నూరి పోశారు. అనంతరం గ్రామంలోని బిఆర్ఎస్ కార్యకర్త గొల్ల నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంటా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుర్రి గోపాల్, నాయకులు బిక్షపతి, బలరాం తదితరులు ఉన్నారు

# పోచంపల్లి గ్రామంలో సీడ్ బాల్ క్యాంపెయిన్

సూర్య వేల్పూర్




వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో సీడ్ బాల్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఇందులో భాగంగా (విత్తనాలు బంతులు ) పోచంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో విత్తన బంతులు తయారు చేయించి ఈ రోజు గ్రామ అభివృద్ధి కమిటీ కామన్ ల్యాండ్ లో విద్యార్థులతో వేయించారు ఈ విత్తన బంతులు వేయడం వల్ల వర్షం పడ్డప్పుడు అనుకూలమైన వాతావరణం ఏర్పడినప్పుడు విత్తన బంతిలో ఉన్న విత్తనం మొలకెత్తి వృక్షాలుగా మారుతాయి అని అన్నారు. పర్యావరణం కాపాడడానికి పిల్లలకు అలాగే గ్రామ ప్రజలకు అవగాహన మరియు పర్యావరణాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. విత్తన బంతులు తయారు చేసుకోవడానికి 60 శాతం ఎర్ర మట్టి 30% కంపోస్ట్ 10 శాతం బొగ్గు పడి లేదా బూడిద అంతా కలుపుకొని కొద్దిగా నీటిని కలుపుకొని ఆ మిశ్రమము చిన్న బంతి లేదా లడ్డు లాగా చేసుకుంటూ విత్తనాన్ని మధ్యలో పెట్టి గుండ్రం గా తయారు చేయించి తర్వాత నీడలో ఒకటి లేదా రెండు రోజులు ఆరబెట్టాలి తదనంతరం ఇప్పుడు తయారైన బంతులు మనకు కావలసిన చోట చల్లుకోవడం వల్ల వర్షాలు పడిన తర్వాత విత్తన బంతుల్లోంచి విత్తనం మొలకెత్తి చెట్లు లాగా మారుతాయి. ఈ విత్తనబంతి విధానము విసిరే విధంగా ఉండడంతో సులువుగా వెళ్లలేని చోట్లో కూడా వేయడంతో మొక్కలను పెరిగేలా చేయవచ్చు. ఈ విత్తన బంధువులు వర్షాలు పడిన తర్వాత విత్తన బంతులు కరిగి విత్తనం మొలకెత్తుతుంది వాటి కావాల్సిన పోషకాలు మట్టి ద్వారా కంపోస్టు ద్వారా మొక్క ఎదుగుతుంది అన్నారు .వర్షం పడే వరకు ఆ విత్తన ఇందులో ఉన్న విత్తనము అలాగే ఉంటుందని అన్నారు అనంత రం గ్రామ ఖాళీ స్థలంలో పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్ర మంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రోగ్రాం మేనేజర్ ఉదయ్, ఉపేంద్ర సీఆర్పీలు చింత శ్రీనివాస్, నోముల మహేందర్ శివ సాయి వెంకటేష్ గ్రామ సెక్రటరీ సమత, ప్రధాన ఉపాధ్యాయులు లింబాద్రి, విద్యార్థులు పోచంపల్లి వీడీసీ ప్రతినిధులు ఆశ వర్కర్స్ గ్రామ మహిళా సంఘం సభ్యులు ఉన్నారు

# రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవం

సూర్య కామారెడ్డి



ఈ రోజు రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో విఆర్కె జూనియర్ కళాశా లలో ప్రపంచ అవయవదాన దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యూరాలిజిస్ట్ డాక్టర్ గీరెడ్డి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అవయవ దానానికి సంబంధి ంచిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు దీనిపైన పూర్తి అవగాహన పెంపొందించుకొని అవయ వ దానానికి ముందుకు రావాలని అన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దేశవ్యా ప్తంగా అవయవ దానం పైన అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిం చడం జరుగుతుందని దానిలో భాగంగానే కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితు లుగా విచ్చేసిన రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు అవయవాలు కావాల్సిన వారి సంఖ్య పెరిగిపోవడం చాలా బాధాకరమని అవయవదానం చేయడానికి ముందుకు వచ్చే వారి సంఖ్య ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో చాల తక్కువగా ఉందని అన్నారు దీనిపైన మరింతగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అవయవ దానం చేసిన వారి కుటుంబాలను ప్రభుత్వం గౌరవించి ఆర్థికం గా సహకారాన్ని అందజేస్తే మరింత మంది అవయవదానం చేయడానికి ముందుకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు యాచం శంకర్, కార్యదర్శి సబ్బని కృష్ణ హరి,కోశాధికారి వెంకటరమణ, రోటెరీయన్స్ సుధాకర్,సంతోష్,నవీన్, ప్రిన్సిపాల్ శంకర్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

## - ప్రిన్సిపాల్ గులాం ముస్తఫా

సూర్య నస్రుల్లాబాద్



మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని,వాటి వ్యసనం కుటుంబం, ఆరోగ్యం,భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని ఎస్ఆర్ఎం ఎన్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ గులాంముస్తఫా అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1,3ఆధ్వర్యంలోమాదకద్రవ్యాలనిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల ముప్పు గురించి వివరిస్తూ,వాటికి దూరంగాఉండిసమాజాన్నికూడా దూరంగా ఉంచేలా ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులు అప్రమత్తంగాఉండాలనిసూచించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ భగవాన్ రెడ్డి, డాక్టర్ రాజేష్, విట్టల్, చిరంజీవి, అంబయ్య, కృష్ణ, రాజేష్, శ్రీనివాస్, అనిత, సుధాకర్ రెడ్డి, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కిశోర, దివ్యాంగ, వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేయాలి

సూర్య- బిక్కనూర్



మహిళా సమాఖ్య ఆధ్వర్య ంలో కిశోర బాలికల, దివ్యాంగ మహిళల, వృద్ధు ల మహిళ సంఘాలను ఏర్పాటు చేసే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలని, ఐకెపి ఎపిఎం సాయిలు సూచించారు. బుధవారం మండల ంలోని పలు గ్రామాలలో కిశోర బాలికల, దివ్యాంగ సంఘాల ఏర్పాటు కోసం మహిళా సమైక్య సభ్యులకు ఇంటింటి సర్వే నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. చిన్న సంఘాలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక అభివృ ద్ధిని సాధించేందుకు మంచి అవకాశం ఉన్నందున మహిళలు ముందుకు వచ్చి సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా సమైక్య అధ్యక్షులు, వివోఏలు, డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి

సూర్య- బిక్కనూర్



భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ లలో ఉంటున్న వారికి ముందస్తుగా అవగాహన కల్పించారు. గతంలో భారీ వర్షాల వల్ల డబుల్ బెడ్ రూమ్ లు నీట మునిగిన విషయాన్ని వారికి వివరించారు. భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందులకు గురికాకుండా ముందస్తుగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామ్ కాలనీవాసులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

సూర్య- బిక్కనూర్




భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్య ంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సిజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలను అప్ర మత్తం చేసి అవగాహన కల్పించాలని, జిల్లా ఉపవైద్యా ధికారి ప్రభు కిరణ్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. అన్ని రకాల వ్యాధులకు కావలసిన మందులను అందు బాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణీలు డెలివరీ అయ్యేవిధంగా వారిని ప్రోత్సహించాలని వివరించారు. ఈ కార్యక్ర మంలో మండల వైద్యాధికారి హేమీమా, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకట రమణ సిబ్బంది ఉన్నారు.

# ఎంపీ ధర్మపురి నర్సింగ్ పల్లిలో పర్యటన

సూర్య మోపాల్

మోపాల్ మండలంలోని నర్సింగ్ పల్లి లో ఎంపీ ధర్మపురి అర్వింద్, భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కుల కర్ణి తో కలిసి పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక బూత్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పారమర్శించారు. అనంతరం మోపాల్ మండల పార్టీ కమిటీ కోశాధికారిగా సేవలందిస్తున్న శ్రీధర్ రెండు రోజుల కిందట వివాహం జరగగా వారి ఇంటికి వెళ్లి నవ దంపతులను ఆశీస్సులు అందజేశారు. భాజపా అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, మండలాధ్యక్షుడు శశాంక్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# కామారెడ్డి మరియు అడ్లూర్ యెల్లారెడ్డి చెరువులను సందర్శించిన జిల్లా ఎస్పీ

- జిల్లాలో వర్షాలతో ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే డయల్ 100 లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08468-220069 కాల్ చేయండి

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి జిల్లాలో రాబోయే రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్న కారణంగా ప్రజలందర ప్రభుత్వంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కోరారు. ఈ సందర్భంగా ఎవరికి ఎలాంటి ఆపదలో ఉన్న డయల్ 100 లేదా కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 08468 220069 నంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు. పట్టణంలోని పోలీసులు అందరూ వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో కలసి పోలీస్ అధికారులు సిబ్బంది సమిష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించాలి అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ వాతావరణ శాఖ ప్రకటన ప్రకారం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరియు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల నీటి ప్రవాహం తీసుకోవా లిసిన చర్యలు, వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉధృతతో రోడ్లు



తెగిపోయిన, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లవద్దని, రోడ్డుకు ఇరువైపులా స్టాపర్స్ పెట్టి ప్రజల రాకపోకలను నిలుపుదల చేయాలని సూచించారు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలతో మరియు ప్రజాప్రతినిధుల తో ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణాలలో గ్రామాలలో మట్టితో కట్టిన పురాతన ఇండ్ల గురించి సమాచారం తెలుసుకుని, ఇండ్లు కూలే ప్రమాదంలో ఉంటే సంబంధిత అధికారుల సహకారంతో ముందస్తుగా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. కావున అలాంటి ఇళ్లల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు చెరువులు కుంటలు వర్షపు నీటితో నిండిన క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను కుటుంబ సభ్యులను వాగులు చెరువులు కుంటలను తిలకించేందుకు ఎవరు వెళ్లవద్దని సూచించారు. నిర్విరామంగా కురిసే వర్షాల కారణంగా విద్యుత్ స్థంబాలకు ఎర్తింగ్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి కరెంట్ షాక్ తగిలే అవకాశం వున్నందున జిల్లా ప్రజలు పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్థంబాలను కానీ విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా జాగ్రత్తగా వుండాలని, అలాగే విద్యుత్ సరఫరా లో ఏదైనా లోపం ఉంటే వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా వరద ఉధృతి ఎక్కువ ఉన్న ప్రదేశాలలో ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సూచించారు. ఎవరైనా సమస్యల్లో లేదా ఇబ్బందుల్లో ఉంటే డయల్ 100 లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08468-220069 నెంబర్లకు సమాచారం అందించినచొ తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడుతామని జిల్లా ఎస్పి తెలిపారు.

## వర్షాల పాట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సూర్య రెంజల్**

మండలంలో కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆసియా ఫాతిమా, ఎస్సై చంద్రమోహన్ లు సూచించారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పొంగి పొర్లుతున్న వాగులు, కాలువల వైపు వెళ్ళవద్దని, పంట పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని, గోదావరి నది పర్యాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, జాలర్లు వేటకు వెళ్ళవద్దని సూచించారు. ఇబ్బందులు కలిగినట్లయితే, సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులకు సంప్రదిం చాలని మండల ప్రజలకు సూచించారు.

## అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి ఎంపీడీవో

**సూర్య నిజాంసాగర్**

మండలంలోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్



ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాగల నాలుగు రోజులు భారీ వర్షాల హెచ్చరి కలు ఉన్న కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సమావేశంలో దిశ నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ అప్ర మత్తంగా ఉంటూ ఎలాంటి నష్టాలు జరుగకుండా స్థానికంగా ఉంటూ చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ భిక్షపతి, ఎస్సై శివ కుమార్, డాక్టర్ రోహిత్, నీటి పారుదల శాఖ ఏఈఈ శివకుమార్, ఎంఈఓ తిరుపతిరెడ్డి, ఐకెపి ఏపిఎం ప్రసన్నారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ సుమలత, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**సూర్య మాక్లూర్**

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు.వీఆర్ఈసీ కాలేజీ నుంచి దాస్ నగర్ వరకు జాతీయ జెండాలు, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భ ంగా బీజేపీ నాయ




కులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయతను చాటేం దుకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఆమంద విజయ్ ,మండల అధ్యక్షురాలు మాదరి మమత,మాజీ అధ్యక్షుడు సురేష్ నాయక్, సంతోష్,నర్సింగ్ రావు,రాజేందర్, ధర్మపతి, రాజేశ్వర్, రాజశేఖర్, చరణ్, శ్రీనాథ్,రమేష్,అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తుల నుండి దేశ సంపద కాపాడుదాం

**సూర్య- నవీపేట్**

కార్పొరేట్ శక్తుల నుండి దేశ సంపదను కాపాడుకోవడానికి, క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గల చౌరస్తాలో దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 1942 సంవత్సరంలో గాంధీ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా పోరాటాన్ని ఆగస్టు 13వ తేదీన చేపట్టారని. అదే స్ఫూర్తితో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. దేశ సంపద సుమారు 60 శాతం కార్పొరేట్ చేతుల్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నవరత్నాల లాంటి ఫ్యాక్టరీలను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కు అప్పజెప్పడం వల్ల భవిష్యత్తులో కార్మిక వర్గానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. వ్యవసాయ రంగంలో అంబానీ, ఆదాని లాంటి వారికి భూములు కేటాయిస్తూ కార్పొరేట్ వ్యవసాయం చేయించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో చిన్న, సన్నకారు రైతుల దగ్గర భూమి లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.. విద్యారంగంలో కార్పొరేట్ కళాశాలలు వచ్చి లక్షల ఫీజు వసూలు చేయడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ తీరు మారకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గోవింద్ నాయక్, ఆంజనేయులు, రాధ, తెలంగాణ రైతు సంఘం నాయకులు దేవేందర్ సింగ్, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.




## పిట్లం మండల ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి

**సూర్య పిట్లం**

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప ఇల్ల నుండి బయటకు రావద్దని ఎస్సై వెంకట్రావ్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రం అయిన పిట్లం పోలీస్ స్టేషన్లో బుధవారం ఎస్సై విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం భారీ



వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప ఇల్ల నుండి బయటకు రావద్దు అని, ఇంటికి గాని పనికి గాని వెళ్లే తొందరలో వరద ప్రవాహాలను దాటే ప్రయత్నం చేసి మీ విలువైన ప్రాణాలు కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు. పాడుబడిన లేక కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ఉండేవారు దయచేసి ముందే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. కరెంట్ ట్రాన్స్ఫార్మర్లకు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, తడిచేతులతో కరెంట్ స్విచ్ అయ్యే వస్తువులను ముట్టుకోవద్దు అన్నారు. కరెంట్ పోల్స్, లైన్స్ ప్రమాదకరంగా ఉంటే వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## మహిళా సాధికారత విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన

- మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ.ప్రమీల

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది కామారెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై




అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా జెండర్ ఈక్వాలిటీ మరియు ఫైనాన్షియల్ లిటసి అనే అంశము పై అవగాహన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు సంబంధించిన వివిధ అంశాలతో కూడిన పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని ఏ ప్రమీల సూపరింటెంట్ అరుణ్ భాస్కర్ రావు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే విజయ్కుమార్ మరియు విద్యార్థులు జిల్లా మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జంగంపల్లిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం

**సూర్య- బిక్కనూర్**

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ



సందర్భంగా ఎక్సైజ్ సీఐ మధుసూదన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పెద్ద ఎత్తున ఈత వనాన్ని నాటారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సబిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి గుడిసె బాబు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్, మండల ఉపాధ్యక్షుడు సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రె టరీ ప్రకాష్ గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, నర్సింలు, అమీన్, ప్రవీణ్ గౌడ్, కార్తీక్, రమేష్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు

## కారు ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండల పరిధిలోని లక్కోరా గ్రామం వద్ద ఈరోజు అనగా మంగళవారం తేదీ 13 నా మధ్యాహ్నం 12.30 నిమిషాల సమయంలో లక్కోర గ్రామ శివారు వద్ద హనుమకొండ నుండి నిజాంబాద్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు తన ముందున్న కారును



ఓవర్టేక్ చేస్తు ఎదురుగా ఒక కారుకు ఢీకొట్టడంతో అట్టి కారు ధ్వంసం అయ్యిందని ఎస్సై సంజీవ్ తెలిపారు. ధ్వంసం అయిన కారు ఏర్గట్ల గ్రామానికి చెందిన షేక్ రఫీక్ అనే వ్యక్తిదని తెలిపారు. షేక్ రఫిక్ ఆర్టిసి బస్సు డ్రైవర్ గుగులోత్ రాము ఫిర్యాదు చేయగా చేయగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదన్నారు.

## మున్సిపాలిటీలో నషాముక్త భారత్ అభియాన్

**సూర్య బాన్సువాడ రూరల్**

బాన్సువాడ పురపాలక సంఘ కార్యాలయంలో నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహిం చారు. కమిషనర్ శ్రీ బి. శ్రీ హరి రాజు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది,




బిల్ కలెక్టర్లు,వార్డు అధికారులు అందరు ఒకచోట చేరి,మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞలో భాగంగా మద్యం, మాదకద్రవ్యాలు, ధూమపానం వంటి హానికరమైన వ్యసనాలకు దూరంగాఉండాలని, అలాంటి అలవాట్ల నుండి ఇతరులను కూడా దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపుని చ్చారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వ్యసనాలు వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబ సౌఖ్యాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని, సమాజ శాంతి భద్రతలను కూడా దెబ్బతీస్తాయి అన్నారు. యువతలో మాదకద్రవ్యాల వాడకాన్ని నివారించడా నికి అవగాహన కల్పించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. చిన్నచిన్న అలవాట్లు కూడా భవిష్యత్తులో పెద్ద నష్టాలకు దారితీస్తాయని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మనమంతావ్యసనాలనుంచి దూరంగా ఉంటేనే, ఆరోగ్యవంతమైన, సుఖ సమృద్ధిగా ఉన్నసమాజాన్ని నిర్మించ గలుగుతా మన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ నశాముక్త భారత్ కోసం కట్టుబడిపనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# రానున్న నాలుగు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు

## - ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సమావేశం...! -సంబంధిత శాఖ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వీడాలి

## - ఎల్లారెడ్డి ఆర్డీవో,పార్థ సింహారెడ్డి ,తహసిల్దార్ ప్రేమ్ కుమార్

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి, ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి డివిజన్,లోని సంబంధిత శాఖ, అధికారులతో, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రానున్న నాలుగు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నాయని,ముందస్తుగా ఎల్లారెడ్డి డివిజన్ లోని పలు సంబంధిత శాఖ అధికారులతో నాలుగు రోజులు అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని ప్రజలు అవసరం మేరకే బయటకు రావాలని అనవసరంగా బయటకు వచ్చి ఇబ్బందులు పడద్దని ఆర్డిఓ సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న నాలుగు రోజులు ప్రజలకు ఎటువంటి ఆటంకం కలగకుండా అధికారులు విధుల్లో సెలవులు పెట్టకుండా విధులు నిర్వహించాలని నిర్లక్ష్యం వహించకుండా నాలుగు రోజులు భారీ వర్షాల,కురిసే అవకాశం ఉందని వాటి నుంచి ప్రజలను కాపాడే బాధ్యత అధికారులుగా మనపై ఉందని విధులు నిర్వహించాలని ఆర్డీవో అధికారులకు ఆదేశించారు.పోలీస్ శాఖ వారిని 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ఆపదలో వచ్చే కాల్స్ ను తప్పకుండా రిసీవ్ చేసుకోవాలనిఅగ్ని మాపక శాఖ వారిని విపత్కర పరిస్థితుల్లో కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేసుకో వలసినదిగా ఆర్డీవో ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులను పౌరులకు విద్యుత్తు అవాంతరాలు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.ల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ ను అప్రమత్తమంగా ఉండవలసిందిగా ఆదేశించడం జరిగింది. అదేవిధంగా ఆర్డీవో ఆఫీస్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. కంట్రోల్ రూమ్ యొక్క నెంబర్ 9492022475. డివిజన్ స్థాయిలోఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగిన పౌరులు పై నెంబర్ ని సంప్రదించగలరు.అదేవిధంగా జిల్లాస్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. 08468220069 ఈ నెంబర్ కి కాల్ చేసి విపత్తు పరిస్థితిని నివేదించగలరు.అనంతరం ఎల్లారెడ్డి తాసిల్దార్ కార్యాలయంలో ఎల్లారెడ్డి తాసిల్దార్ ప్రేమ్ కుమార్ మండలంలోని పలు సంబంధిత శాఖ అధికారులతో రానున్న నాలుగు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలకు కాపాడే బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ప్రతి అధికారి సెలవులు పెట్టకుండా నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండి వర్షాల నుండి ప్రజలను కాపాడాలని తెలిపారు.



## గోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

**సూర్య ఎల్లారెడ్డి**



శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రసిద్ధ వేణు గోపాలస్వామి ఆలయంలో ఈ శనివారం ఆధ్యాత్మిక వేడుకలు అట్టహాసంగా జరప నున్నట్లు విశ్వ హిందూ పరిషత్ ఎల్లారెడ్డి ప్రఖండ అధ్య క్షులు సాతెల్లి నవీన్ కుమార్ బుధ వారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలో ఉదయం 7 గంటలకు యజ్ఞం, 10 గంటలకు గోపూజ, 11 గంటలకు ప్రముఖ వక్తల సందేశం, అనంతరం గోపాల కలువ (ఉట్టి కొట్టడం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 గం.లకి అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం తో పాటు చుట్టుపక్కల ప్రాం తాల ప్రజలు ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సాతెల్లి నవీన్ కుమార్ కోరారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్ర మంకు భక్తులకు శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందే అద్భుత అవకాశంగా నిలుస్తుందని ఆయన అన్నారు.

## ఎల్ఐసిలో చీఫ్ అడ్వయిజర్ల కృషి అభినందనీయం

**సూర్య కామారెడ్డి టౌన్**



జీవిత బీమా వ్యాపారం, ఏజెంట్ల నియమాకం, పాలసీదారుల కు సేవలు అందించండంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లల (క్లియా) కృషి అభినందనీ యమని, క్లియాల ద్వారా దాదాపు 25 శాతం వ్యాపారం రావడమే ప్రాధాన్యతను తెలియజేస్తుందని ఎస్ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ కృష్ణమోహన్ అన్నారు. క్లియా వెల్ఫేర్ అసోసియేన్ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎల్ఐసీ శాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. అనంతరం మేనేజర్ కృష్ణ మోహన్ ను క్లియా అధ్యక్షుడు వి.రాజారెడ్డి సన్మానించారు. సికింద్రాబాద్ డివిజన్ కోశాధికారి ఎం.సంతోష్, ప్రతినిధులు కే.మధుసూదనరావు, కుసుమ బాలకిషన్, వి.జయసింహరెడ్డి, కాసర్ల శంకర్, లియాఫీ అధ్యక్షుడు కదం నారాయణరావు, బ్రాంచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రజక సంఘం నాయకులపై కేసు నమోదు..

**సూర్య- నవీపేట్**

మండల కేంద్రంలో గల బాసర రహదారి మూలమలుపు వద్ద డి50 కాలువ పరిధిలో గల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చాకలి ఐలమ్మ విగ్రహం ప్రతిష్టించడానికి నిర్మాణ పనులు చేయుచున్నారనే విషయం తెలుసుకొని డిఈఈ బలరామ్ ఆదేశాల మేరకు రజక సంఘం నాయకులైన కామయ్య, భోజన్న, నర్సింగ్, ప్రసాద్ లకు ఆ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టకూడదని పలుమార్లు హెచ్చరించినప్పటికీ వినకుండా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గద్దెను నిర్మించి బుధవారం ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది. ఎలాంటి అనుమతులు లేకుండా డి50 కాల్వ పరిధిలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించిన రజక సంఘం నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏఈ శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ మహామేళా

**సూర్య మాక్లూర్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ లు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏకకాలంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణరెడ్డి అధికా రులను అదేశించారు.అందులో భాగంగానే బుధవారం అధికారులు మండ౼ల వ్యాప్తంగా 31 ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి "మార్కింగ్ మహామేళా" చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానంద రెడ్డి,ఎంపీవో శ్రీనివాస్,ఐకేపీ ఏపీఎం ఉమేష్,మహిళా సంఘాల సభ్యులు,పాల్గొన్నారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**:సాలురా తహసిల్దార్**

**సూర్య బోధన్ రూరల్**



రానున్న రెండు రోజులపాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నా నేపథ్యంలో ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని తాహసిల్దార్ శశిభూషణ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంజీరా పరివాహక ప్రాంతాలలో ఉన్న గ్రామాల ప్రజలు మంజీరా నది వైపు,వాగులు, కాలు వలు,చెరువులు వద్దకు వెళ్లకూడదని సూచించారు.పాత ఇండ్లు కూలిపోయే దశలో ఉంటే అప్రమత్తంగా ఉండి గ్రామ పంచాయతీకి సమాచారం ఇచ్చి పునరావాస కేంద్రంలో ఉండాలని కోరారు.విద్యుత్ స్తంభాల దగ్గరకు గానీ, విద్యుత్ తీగల దగ్గరకు,మోటార్ల దగ్గరకు, తెగిపోయిన వైర్ల దగ్గర వెళ్ల కుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.ఏద్దైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత గ్రామ పంచాయితికి,విద్యుత్ శాఖ,గ్రామ రెవెన్యూ సహాయ కులకు,పోలీసు సమాచారం అందించవలసిందిగా కోరారు.

## భారీ వర్షాలు- పోలీసుల హెచ్చరిక..

**సూర్య- నవీపేట్**



రాగల 72 గంటలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చ రించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వినయ్ కుమార్ బుధవారం సూచించారు.భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థి తులు తలెత్తినా, సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అధి కారులు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని సూచించారు. వాగులు వంకలు పొంగిపొరలే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రయాణాలను వాయి దా వేసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్షం వల్ల ఏద్దైనా సమస్య ఎదురైతే 100 లేదా 8712659845, 8712659729 నెంబర్లకి సమాచారం అందిం చాలని తెలిపారు. చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనా లలో ఉండరాదని, కరెంటు స్తంభాలు ముట్టుకోరాదని సూచించారు.

## ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపిన ఇందల్వాయి గ్రామ విడిసి సభ్యులు

**సూర్య మోపాల్**



ఇందల్వాయి రామాలయానికి 25 లక్షల ప్రొసీడింగ్ ఇచ్చిన ఎమ్మెల్యే భూపతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ అభివృద్ధి శ్రీ సీతా రామ చంద్ర స్వామి దేవాలయం ఇందల్ వాయి నకు దేవాలయ అభివృద్ధిలో భాగంగా రూరల్ నియోజక వర్గ శాసన సభ్యులు మాన్యులు భూపతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆలయం లో నూతనం గా నిర్మించ తలపెట్టిన రాజగోపుర నిర్మాణానికి సుమారుగా 25 లక్షల రూపాయల ప్రొసీడింగ్ సాంక్షన్ చేయించినదుకు వారినీ ఇంద ల్వాయి గ్రామ అభివృద్ధి కమిటీ మరియు వివిధ కులసంఘాలు, నాయకు లు, గ్రామంలోని విద్యావంతులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు భూపతిరెడ్డి నీ కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపరు ఇంద ల్వాయి గ్రామానికి మరియు ఆలయ అభివృద్ధికి మున్ముందు నిధులు సమకూర్చి అభివృద్ధిలో ఉంచాలని ఇందల్వాయి గ్రామ విడిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్ర మంలో ఇందల్వాయి గ్రామ విడిసి సభ్యులుఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఇందల్వాయి సహకార సంఘ చైర్మన్, మాజీ వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షులు, మాజీ ఆయకట్టు చైర్మన్, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై బెల్ట్‌లను వితరణ చేసిన మాజీ సర్పంచ్

**సూర్య, నాగిరెడ్డి పేట్**



నాగిరెడ్డిపేట మండలంలోని జప్తి జానకంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల లోని 87మంది విద్యార్థులకు బుధవా రం గ్రామ మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు టై బెల్టులను వితరణ చేసి నారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు మాట్లాడు తూ..విద్యార్థులందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి జ్ఞానాన్ని పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చి క్రమశిక్షణతో కూడిన విద్య ఆటలు పాటలు నేర్చుకొని అన్ని రంగాల్లో రాణిస్తూ పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ ,పంచాయతీ కార్యదర్శి శంకర్ నాయక్ ,మాజీ సర్పంచ్ లక్ష్మా గౌడ్,మాజీ ఎంపీటీసీ రమావత్ దేవి సింగ్ ,పిఏసిఎస్ వైస్ చైర్మన్ మిద్దె బాబురావు ,పాఠశాల మాజీ చైర్మన్లు జోడు సురేందర్ ,మిద్దె బాలరాజ్,పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ రాకేష్ రియాజ్ తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## భారీ వర్షాల కారణంగా

## అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి.

**మండల పరిషత్ అధికారి మహబూబ్.**

**సూర్య, బీర్కూర్**



రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కారణంగా అధికారులంతా అప్రమ త్తంగా ఉండాలని మండల పరిషత్ అధికారి మహబూబ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రోజు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమా వేశంపై మెహబూబ్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని, వర్షా నికి కూలిపోయే పరిస్థితిలో ఉన్నటువంటి ఇంటి నుండి ముందు జాగ్రత్తగా వేరే దగ్గర పునరావాసం ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి చెరువులు, కుంటలు దగ్గరికి వెళ్లకుండా ఉండాలని ఆయన తెలిపారు. అత్యవసరమైతేనే తప్ప బయటకు రాకూడదని ఏవైనా ఇబ్బందులు ఉన్నచో అధికారులకు తెలియ జేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భుజంగరావు, ఎస్సై రాజశేఖర్, ఎంఈఓ వెంకన్న సుపరిండెంట్ భాను ప్రకాష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**సూర్య మాక్లూర్**



విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాక్లూర్ ఏఎస్ఐ రమేష్ అన్నారు.మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కల్లెడ,చిన్నాపూర్ గ్రామాలలో బుధ వారం మాదకద్రవ్య రహిత భారతదేశం ప్రచారంలో భాగంగా విద్యార్థులతో నషా ముక్త్ భరత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు.దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి అందరూ కృషి చేయాలని సూచించారు.అనంతరం మానవహారం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలు భారతదేశాన్ని వీడాలి

**సూర్య ఇందూర్:**

క్విట్ కార్పొరేట్ నినాదంతో సంయుక్త కిసాన్ మోర్చా(SKM), వామపక్ష కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు నిజామాబాద్ లోని NTRచౌరస్తాలోబీ మోడీ – ట్రంపు ల దిష్టి బొమ్మల దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్ర మానికి దేవరాం అధ్యక్షత వహించగా. పల్లపు వెంకటేష్, వేల్పూర్ భూమయ్య లు మాట్లా డుతూ... 1942 సంవత్సరం ఆగస్టు 9వ తేదీన ఆనాటి బ్రిటిష్ వలస పాలకులను తరిమికొట్టడం కోసం క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టారు. ఈరోజు మోడీ ప్రభుత్వం భారతదేశం మొత్తాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుంది. ఇంకా అప్పగించ చూస్తున్నది. వ్యవసాయ రంగం, కార్మిక రంగాలను నిర్వీర్యం చేస్తున్నాయి. స్వదేశీ వ్యాపారాలు క్షీణించిపోతున్నాయి. ఆనాడు బ్రిటిష్ వాళ్లకు భూస్వామ్య,ధానాద్య వర్గాలు ఏ విధంగానైతే సపోర్టుగా నిలబడ్డాయో.., ఈనాడు బిజెపి మతోన్మాద పాలకులకు కార్పొరేట్ సంస్థలు, బడా పెట్టుబడిదారులు, ధనార్ధేవర్గాలు, భూస్వామ్య వర్గాలు మద్దతుగా నిలుస్తున్నాయి. వీరి అండదండలు చూసుకుని బిజెపి దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నది. దీన్ని




నిరసిస్తూ ఈరోజు దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా (SKM),, అలాగే వామపక్ష కార్మిక సంఘాలు క్విట్ కార్పోరేట్ అనే నినాదం తీసుకొని పోరాడుతుంటే.., క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా బ్రిటిష్ పోలీసులు వ్యవహరించని రీతిగా ప్రస్తుతం ఇండియా పోలీసులు దిష్టిబొమ్మను కూడా తగలబెట్ట నీయకుండా అడ్డుకొని దిష్టిబొమ్మల కాళ్లు, చేతులు చింపేసి ఆనందించారు. కానీ క్విట్ కార్పొరేట్ ఉద్యమకారులు వెనకడుగు వేయ కుండా దిష్టిబొమ్మల మధ్యలో ఉన్న కాగితాలనైనా తీసి తగలబెట్టి మరీ నిరసన వ్యక్తం చేసి జయప్రదం చేశారు అని వారు అన్నారు. ప్రస్తుత పోలీసు వ్యవస్థని విమర్శించారు. ఎన్ని ఆటం కాలు, ఎన్ని నిర్బంధాలు విధించినా కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు ఈ దేశ శ్రేయస్సు కోసం వెనకడుగు వేయరు అని నొక్కి చెప్పారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం దేశాన్ని కార్పొ రేటీకరణ – కాషాయీకరణ చేయకుండా దేశ ప్రయోజనాలే పరమావధిగా ఉంటూ పాలన కొనసాగించాలని.! లేనిచో 200 సంవత్సరాలు పరిపాలించిన బ్రిటిష్ వాళ్ళని తరిమికొట్టిన దేశ ప్రజలకు మిమ్మల్ని తరిమికొట్టడం అంత కష్టం కాదు అని హెచ్చరించారు. నాడు బ్రిటిష్ పాలకులకు అండదండగా నిలిచిన ఆర్ఎస్ఎస్, జన సంగ్, సంఘ పరివార్ శక్తులు ఈరోజు నీతి మాటలు పలుకుతున్నారని పెద్ద వెంకట్ రాములు, రమేష్ బాబు, వెంకటేష్, వేల్పూర్ భూమయ్య,కంజెర భూమయ్య, నూర్జహాన్, సుధాకర్ లు అన్నారు. అందుకోసం కార్పొరేట్ వ్యవస్థల నుండి దేశాన్ని కాపాడుకునేంత వరకు మా పోరాటాలు ఆగవని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో, ఓమయ్య, సాయి రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి %×ఖీఖ% శివ, కమలాపురం రాజన్న, సాయ గౌడ్, AIDWA అధ్యక్ష – కార్యదర్శులు అనిత – సుజాత, విద్యార్థి సంఘాల నాయకులు విగ్నేష్, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి.

### - ఎస్సై భార్గవ్ గౌడ్.

**సూర్య ,నాగిరెడ్డిపేట్**




విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ విద్యార్థులను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సై ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తాను మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడినని పట్టుదలతో చదివి ఈ స్థాయికి వచ్చినట్టు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. కష్టపడి చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ ,ద్వితీయసంవత్సరం పరీక్షల్లో కళాశాలలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 5 వేల రూపాయలు, సెకండ్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 2,500 రూపాయలు బహుమతిగా అందజే స్తానని మండలంలోని గోలి లింగాల్ మాజీ సర్పంచ్ మురళి సభలో ప్రకట ించారు. అలాగే కళాశాలలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థికి 5 వేల రూపాయలు బహుమతిగా అందజేస్తానని గోపాల్ పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రామిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్సై భార్గవ్ గౌడ్ ను కళాశాల లెక్చరర్ల బృందం శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నరేందర్, కళాశాల ఇంచార్జి రాజశేఖర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుడు మురళి గౌడ్, కళాశాల లెక్చరర్ల బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం ద్వారానే పూర్తి విజ్ఞానం

### : ప్రిన్సిపల్ డాక్టర్ కే విజయ్ కుమార్

**సూర్య కామారెడ్డి**



ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ (ఎ) కళాశాల, కామారెడ్డి గ్రంథా లయ వారోత్సవాలను ఘనం గా నిర్వాహించారు. ఈ కార్య క్రమానికి హాజరైన కళాశాల ప్రినిపాల్ డా. కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయాల దినోత్సవాన్ని డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి సందర్భంగా జరుపు కుంటారని , అతను భారతీయ గ్రంథాలయ పితామహుడుగా ఆయన చేసిన విలువైన సేవలకు గాను భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రదా నం చేసిందనీ తెలియ జేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాల యాన్ని సందర్శించి జ్ఞానబండాగారాన్ని పెంపొందించుకోవాలని సూచిం చారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కె. కిష్టయ్య మాట్లాడుతూ గ్రంథాల యాలు ఆధునిక దేవాల యాలని పుస్తక పఠనం ద్వారానే పూర్తి విజ్ఞానం అందుతుందని, ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు మొబైల్, ఇంటర్నెట్ వాడకం పెరిగిందని, కానీ పుస్తకం చదవడం ద్వారానే ఎక్కువ గుర్తుం టుందని తెలిపారు.ఈ సమా వేశంలో లైబ్రరీ ఇంచార్జి డా. దినకర్ , IQAC కోఆర్డినేట్ జయప్రకాశ్,, హిందీ విభాగ అధ్యాపకులు డా. శ్రీనివాసు రావు, బాలాజి, లైబ్రరీ నిర్వాహకులు మారుతి , విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డ్రగ్స్ రహిత సమాజం మనందరి సంకల్పం"

**సూర్య ఇందూర్**



నషా ముక్త భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా RTC ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వ హించబడింది. మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణ, డ్రగ్స్ రహిత జీవనశైలి పాటించడం, అక్రమ రవాణా నిరోధం వంటి అంశాలపై సిబ్బం ది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం నిజామాబాద్ రీజినల్ మేనేజర్ టి. జోస్నా ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అధికారులు మరియు ఆఫీస్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు,

## కాంగ్రెస్ నాయకున్ని పరామర్శించిన సీడ్ కార్పొరేషన్ చైర్మన్

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడి తల్లి మరణించినందున ఆమె కుమారుడు దామోదర్ గౌడ్‌ను రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పచ్చలనడుకూడా గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, నర్సయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి

### - సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్ రెడ్డి

**సూర్య బాల్కొండ**




మాదక ద్రవ్యాల నియంత్ర ణలో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో నిర్వహించిన మాదక ద్రవ్యాల నివారణ ప్రతిజ్ఞను విద్యార్థు లతో చేయించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతుమాదక ద్రవ్యాలు నియంత్రించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. మాదక ద్రవ్యాలు వ్యక్తిగత జీవితాన్ని కుటుంబాన్ని, భవిష్యత్‌ను నాశనం చేస్తాయన్నారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల వలలో చిక్కు కొకుండా జాగ్రత్త పడాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాల ను ఎంచుకొని క్రమశిక్షణతో ముందుకు సాగా లన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వాటి ప్రభావంపై విద్యార్థు లకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నామని తెలిపారు. విద్యార్థి నులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్‌క్రైం నేరాలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. డ్రగ్స్ గురించి ఎలాంటి విషయమైన విద్యార్థులకు తెలిస్తే వెంటనే 1908, నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల నియంత్రణ గురించి ప్రతిజ్ఞను బాల్కొండ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శైలేందర్ చేయించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు విద్యార్థులు పాల్గొన్నారు.

## పీజీ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదల

**సూర్య కామారెడ్డి**




ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కామారెడ్డి పీజీ ద్వితీయ సంవత్సర నాల్గవ సెమిస్టర్ ఫలితాలను బుధవారం తెలివి పరీ క్షలు నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కే.సంపత్ కుమార్ మరియు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే విజయ్ కుమార్ వెల్లడించినట్టు కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె. కిష్టయ్య తెలిపారు.కళాశాల స్వయం ప్రతిపత్తి హోదా పొందిన తరువాత మొదటి బ్యాచ్ విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధిం చారని, ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను అధ్యాపకులను, విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలివి పీజీ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి సంపత్ కుమార్, కళాశాల అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు ఏరాజేందర్, ఎన్ .రాములు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**సూర్య బోధన్ రూరల్**



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం పట్ల నిర్లక్ష్యం వహించ కుండా నాణ్యతను పాటించాలని సాలూర మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్,ఎంపీడీవో శ్రీనివాస్ మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు.బుధవారం సాలురా మండలం హున్సా పాఠశాలలోని మధ్యా హ్న భోజనాన్ని పరిశీలించారు.అంగన్వాడి సెంటర్ ను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు.పిల్లలు,బాలింతలు,గర్భిణీలకు పౌష్టికాహారం సమయాను గుణంగా అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు భోజనం అందించాలని సూచిం చారు.ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యలు లేకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మంజుష,ఏపీఎం సాయిలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ

**సూర్య ఇందూర్**



గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నిజామా బాదులో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశా నుసారంగా బుధవారం కళాశాల మాద కద్రవ్యాల కమిటీ సమన్వయకర్త రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో "మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని మాదకద్రవ్య రహిత సమాజంగా మార్చడంలో ప్రతి వ్యక్తి పాత్ర ముఖ్యమైనదని, అందు కు క్రమశిక్షణ కలిగిన అలవా ట్లను, జీవన శైలిని చక్కగా ఏర్పరుచుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సభ్యులు డాక్టర్ పి.రామకృష్ణ, కళాశాల ఎన్.సి.సి. ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరి గింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, కార్యాలయ బృం దం, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి వినయ్ కుమార్, అకడెమిక్ కోఆ ర్డినేటర్ నహేదా బేగం, అంబేద్కర్ అధ్యయన కేంద్రం ప్రాంతీయ సమన్వ యకర్త డా. రంజిత, పీఆర్.ఓ. డాక్టర్ దండు స్వామి, రమేష్ గౌడ్, శ్రీని వాస్, కిరణ్ కుమార్, లైబ్రేరియన్ పూర్ణచంద్రరావు, ఎన్. ఎస్.ఎస్. ప్రోగ్రా మ్ ఆఫీసర్లు వెంకటరమణ, సుధాకర్,నరేష్ కుమార్, దస్తప్ప, రజిత, నాగజ్యోతి, అనసూయ, ఉమాకిరణ్, గంగాధర్, వెంకటేష్ గౌడ్, మోబిన్, ఏ.ఓ. రామ్ కిషన్, సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, విద్యార్థులు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.